# మ నో ర థం

[విజేత మాసపత్రిక]

"మీకీమధ్య పరాయి ఆడపిల్లలమీద యావ ఎక్కువయి పోయింది!"

అదీ! అదీ మా ఆవిడ అనుమానం!

అనుమానం పెనుభూతమే!

ఈ పెనుభూతాన్ని పారద్రోలటం ఎలా ??....

# మనోరథం

"నువ్వొట్టి అనుమానం మనిషివి!" అన్నాను.

సుజాత అవుననలేదు, కాదనలేదు!

కనీసం నావంక కన్నెత్తి చూడలేదు.

దారం చివర నాలికతో తడిపి సూటిగా తయారుచేసి సూది బెజ్జం లోనికి ఎక్కించే ప్రయత్నం చేస్తోంది.

"నీ వన్నీ అనుమానాలే!" అన్నాను మళ్ళీ.

దారాన్ని సూది బెజ్జంలోంచి అవతలకు లాగి రెండు పేటలు వేసింది. తర్వాత "షర్టుకి నైలాన్ బొత్తాలు వేయనా? మామూలు బొత్తాలు వేయనా?" అంటూ అడిగింది తాపీగా.

నాకు ఒళ్ళు మండిపోయింది.

"నేను నోరు చించుకుని అరుస్తూవుంటే సమాధానం చెప్పవేం? నీవన్నీ అనవసరపు అనుమానాలుకావా? నీ నీడనుచూసి నువ్వే ఉలిక్కి పడుతున్నావు. భర్తపై ప్రతి విషయం గురించీ అనుమానం పెంచు కోటం అంత ఆరోగ్యకరంకాదు."

ఈసారి కాస్త కరుగ్గానే అన్నాను.

"ఏ విషయం గురించీ మీరు మాట్లాడుతున్నదీ?" ఈసారి తాను కుడుతున్నా చొక్కా పక్కకుపెట్టి, నావంక చూస్తూ అడిగింది.

అంటే- ఆమె రియాక్ట్ అవుతోందన్నమాట!

"నిన్న సాయంకాలం విషయమే తీసుకో..." అంటూ తాపీగా చెప్పటం ఆరంభించేను. "...నేను కిటికీ దగ్గర నిలబడితే, నన్ను అను మానంగా చూసేవు. పక్కపెరట్లో జామచెట్టుమీది చిలక తమాషాగా జామపండు కొరుకుతూవుంటే చూస్తున్నాను. ప్రక్కలకు బెదురు చూపులు చూస్తూ, మధ్య మధ్య జాంపండును తన ఎర్రని ముక్కుతో పొడుస్తూ, కేరింతలు కొడుతూ, గాలికి కొమ్మ ఊగుతూవుంటే తమాషాగా రెక్కలు విదుల్చుకుంటూ, ఆ చిలుకచేసే విన్యాసాలు తదేకంగా చూస్తూవుంటే

ఎవరికి మాత్రం తన్మయత్వం కలగదు? మనిషికి కొంత రసజ్ఞతకావాలి!" అంటూ నా ఉపన్యాసం ముగించి, సుజాత వంక ఈసడింపుగా చూసేను.

అవును! రసజ్ఞత కావాలి! ఆ జామచెట్టుక్రిందే- చిరిగి పోయిన తాటికమ్మలే తన మానానికి రక్షలనుకొని— చిలకలాంటి అమ్మాయి అమాయకంగా స్నానం చేస్తూంటే- కిటికీ దగ్గర నిలబడి దొంగ చూపులు చూడటం రసజ్ఞత కాదు మరీ!!

అందరికీ తలుపులతో బాత్‌రూంలు వుండవు.

తడికెలతో కూడా వుంటాయి.

అంత మాత్రంచేత ఆ ఇంటి ఆడపడుచులు స్నానం చేయిటం మానలేరు. దొంగచూపులు చూసే మగవాళ్ళు పక్కింట్లో వుంటారని తెలియక అమాయకంగా వుండటం వాళ్ళతప్పే!!

"చూడటం మాత్రం మీ తప్పుకాదు!"

సుజాత ఈ మాటలు ఎంతో వ్యంగ్యంగా అంది.

"ఇహ ఆపు!" గట్టిగా అరిచేనునేను.

"నువ్వొఠ్ఠి అనుమానాల పుట్టవి! ప్రతి విషయమూ వక్రంగానే చూస్తావు. ప్రతి చిన్న వ్యవహారానికి అనుమానించటం. దాని కోసం తగవులాడుకోవటం, నలుగురి ముందూ అలుసయిపోవటం ఛ! ఛ! తల్చు కుంటేనే నాకు అసహ్యంగా వుంది! నీ అనుమానం ఎలా పోగొట్టాలోనాకు అర్థం కావటంలేదు." అన్నాను అసహనంగా.

నావంక రెండు క్షణాలు తీక్షణంగాచూసి, తర్వాత ఎంతో తాపీగా అంది సుజాత.

"మీ కీమధ్య పరాయి ఆడపిల్లమీద యావ ఎక్కువయి పోయింది."

అదే ! అదే ! అదే ఆమె అనుమానం !!

నేను పడకగది కిటికీ దగ్గర నిలబడి అవతలకు చూస్తూ వుంటే—

పక్కింటి పెరట్లో ఔట్‌హౌసులో అద్దెకున్న అమ్మాయిని చూస్తున్నానని సుజాత అనుమానం !

నేను వీధి గుమ్మం దగ్గర నిలబడి సిగరెట్లు కాల్చుకుంటూ వుంటే—

ఎదురింటి కాలేజీ అమ్మాయికి సంజ్ఞలు చేస్తున్నానని ఆమెకు భయం !!

రోజురోజుకీ ఈ పరిస్థితి చాలా జుగుప్సగా తయారవుతోంది.

'పెళ్ళయిన నాలుగు సంవత్సరాలకే నా మీద మోజు తగ్గిపోయిందా ?' అంటూ ఆమె గుచ్చిగుచ్చి అడగటం— నేను ఏదో అసహజమయిన సమాధానం చెప్పటం — ఇదంతా భరించలేనిదిగా అనిపిస్తోంది.

నేను సుజాతను మనసారా ప్రేమిస్తున్నాను.

తీరువయిన భార్యను ఇంట్లో వుంచుకుని, పరాయి ఆడవాళ్ళ మీద యావ పెంచుకోవలసిన అవసరం నాకు లేదు.

స్త్రీల యెడల నాకు ప్రత్యేక గౌరవంవుంది.

ఎదుట కనిపించే ప్రతి ఆడదాన్ని చెడ్డ దృష్టితోకాకుండా— వారి వ్యక్తిత్వానికీ, ఉన్నతత్వానికి గౌరవమిస్తూ చూడగలిగే మనసు నాకుందనే నా విశ్వాసం !

అయితే—

సుజాత ఈ నాలుగు సంవత్సరాలుగా ఈ విషయం గ్రహించలేకపోవటం మాత్రం నా దురదృష్టం అనుకుంటాను.

"నాకు నీ మీద మోజు తగ్గలేదు, పరాయివాళ్ళమీద పెరగలేదు. అదంతా నీ భ్రమ మాత్రమే ! నేను ఎప్పటిలాగే వున్నాను !"

సుజాత కొంతసేపు మాట్లాడలేదు.

తర్వాత మెల్లగా అంది !

"నిన్న ఉదయం మీరు మా చెల్లాయి కొంగుపట్టుకుని లాగలేదూ ?"

"మైగాడ్ ! అది నీ కంట పడిందన్నమాట !" అన్నాను

"ఏం ? నా కంట పడిందని భయపడుతున్నారా ?"

ఎగతాళిగా అడిగింది.

నేను తేలిగ్గా నవ్వేశాను !

"భయమెందుకు ? నాలో తప్పువుంటే నేను భయపడాలి, నిన్న ఉదయం మీ ఇందిర కొంగుపట్టుకుని లాగేను. కాదనటం లేదు. మరదలు కాబట్టీ, నాతో చనువుగా సరదాగా వుంటుంది కాబట్టీ, లాగేను.--"

"మా చెల్లాయి కాబట్టి ఊరుకుంది —- మరొకరయితే—-- మాట్లాడటం ఆపి నావంక గర్వంగా చూసింది.

"కరెక్ట్ ! మీచెల్లాయి మంచిదికాబట్టే ఊరుకుంది. నేను కొంగు పట్టుకుని లాగేనంటే వేరే ఏ దుర్బుద్ధితోనూ ఆ పని చేయననే విశ్వాసం నా మీద వుంది కనుకనే, ఊరుకుంది. తాను నాకు ఆమాత్రం గౌరవమిచ్చింది. ఆ విషయం మరిచిపోను !"

ఇందిర సుజాతకంటె నాలుగేళ్ళు చిన్నది !

నిరంతరం పరుగెత్తే సెలయేటిలా తుళ్ళిపడుతూ వుంటుంది !

నన్ను ఆటపట్టించటం—

నాతో ఏదో తమాషాలు చేయటం—

నన్ను ఏడిపించటం, ఇవన్నీ ఆమె సరదాలు !

నిన్న ఉదయం ఆఫీసుకు వెళ్ళేసమయానికి, నా స్కూటరు తాళాలు తీసి దాచేసింది. తాళాలు ఆమె చేతిలో ఇరికించుకుని పారిపోవటం చూసి వాటిని లాక్కోబోయాను! కానీ, పట్టు విడిపించుకుని పరుగెత్తింది. అంతలో కొంగు పట్టుకున్నాను.

నవ్వుతూ ఆగిపోయింది.

తాళాలు ఇచ్చేసి వంటింట్లోకి పారిపోయింది.

ఈ విషయం పూర్తిగా సుజాతకు తెలీదు.

సరిగ్గా, నేను ఇందిర కొంగు పుచ్చుకుని లాగేసమయానికి చూసి వుంటుంది.

అప్పుడే ఎన్నోరకాల అనుమానాలు పెంచేసుకుని ఎగతాళిగా మాట్లాడుతోంది.

దీర్ఘంగా నిట్టూరుస్తూ అన్నాను.

"సరే ! నీతో వాదన అనవసరం ! కానీ ఒక్క విషయం మాత్రం నీతో నొక్కి చెప్పదల్చుకున్నాను--"

"ఏమిటది ?"

"--నేను ఏంచేసినా నువ్వు శల్య పరీక్షచేసి చూస్తున్నావు--"

"అలా మీరు అనుకుంటున్నారు !"

"--కాదు, నిజమే అది ! కానీ నీ ఊహలన్నీ భ్రమలే ! ఆ విషయం నేను నిరూపించగలను !"

"ఎలా నిరూపిస్తారో, పాపం !" అంది సుజాత.

"నువ్వు రహస్యంగా నా ప్రతిచర్యనూ గమనిస్తున్నావు ! కాదన గలవా ?"

"నేనేం సి. ఐ. డిని కాను !"

"ఆహా ! అందుకే కాబోలు, మొన్న నా ఆఫీసుగదిలో కూర్చుని ఉత్తరాలు రాసుకుంటూవుంటే, ఎవరో ఆడపిల్లలతో కలం స్నేహం చేస్తున్నానని భ్రమపడి, నా మీద విరుచుకుపడి, నానారాద్ధాంతమూ చేసేవు. త్వరలోనే నీ ఊహలన్నీ తప్పని నిరూపించగలను"

"నిరూపించండి ! అప్పుడు మిమ్మల్ని గురించి మళ్ళీ అనుమానంగా మాట్లాడితే అడగండి. మీకు పరాయి స్త్రీలమీద మోజు పెరిగిందనటంలో మాత్రం సందేహం లేదు !"

అంటూ ఛాలెంజ్ చేస్తున్నట్లు మాట్లాడింది.

"సరే, నువ్వే చూస్తావుగా !" అంటూ బయటకు వచ్చేశాను.

సుజాతకు పాఠం చెప్పాలి.

ఆమె రహస్యంగా నా చర్యలను గమనించి, వాటికి పెడర్థాలను తీస్తోందనీ ఆమెకు తెలిసేలా ఋజువు చేయాలి !

ఎలా ?

ఆరాత్రి దీర్ఘంగా ఆలోచించి ఒక నిర్ణయానికి వచ్చేను.

మరుసటి ఉదయం వీధివరండాలో కూర్చుని పేపరుచూస్తూ కాఫీ తాగుతున్నాను.

అప్పుడప్పుడు చూపులుమార్చి ఎదురింటి కాలేజీ పిల్లను చూస్తున్నట్లు అటూఇటూ తలతిప్పుతున్నాను.

లోపల, హాలులో అద్దంముందు కూర్చుని జడవేసుకుంటూ సుజాత నా చర్యలను గమనిస్తోంది.

నాకు కావల్సిందీ అదే !

ఆఫీసురూములోకి వెళ్ళి, కత్తెరతెచ్చి, నేను చూస్తున్న పేపరులో ఒక మూలనున్న ఎడ్వర్‌టైజ్‌మెంటు గబగబా కత్తిరించి, కాస్తగాభరా నటిస్తూ, ఆ కాగితాన్ని జేబులో కుక్కేసుకున్నాను !

అద్దంలో చూస్తూ నా చర్యలను గమనిస్తోంది సుజాత.

అలా గమనించటమే నాకు కావల్సింది.

పేపరు టేబిలుమీద పడేసి స్నానానికి బయలుదేరాను.

నేను కత్తిరించి జేబులోదాచినది కేవలం 'ట్రాక్టరు అమ్మకం ప్రకటన' మాత్రమే ! దాని వివరాలతోబాటు దాన్ని కొనాలంటే ఎవరిని సంప్రదించాలో ఆ చిరునామా మొదలయినవన్నీ అందులో వున్నాయి.

బాత్‌రూం తలుపు సందులోనుండి సుజాత కదలికలను గమనిస్తున్నాను జాగ్రత్తగా !

ఆమె మెల్లగావెళ్ళి పేపరులో నేను కట్‌చేసిన భాగం తడిమిచూసి, తలపంకించి, మళ్ళీ అక్కడ పెట్టేసింది.

నా పథకం ఫలిస్తోంది !!

నేను 'కలం స్నేహితుల కాలమ్' కట్ చేసి, అందులోని ఏ ఆడ పిల్ల చిరునామాకో ఉత్తరం రాయబోతున్నానని ఆమె అనుమానం !

అదే నాకు కావల్సింది !!

తాను తప్పుదారిలో వెళ్తోందని ఆమె తెలుసుకోవాలి !!

స్నానంచేసి బయటకు వచ్చేను.

బట్టలు వేసుకుని భోజనానికి కూర్చున్నాను.

అంతలో పనిమనిషి పేపరుపట్టుకువచ్చింది.

"ఇదిగో, అమ్మగారూ ! పేపరు !" అంటూ సుజాతకు అందించింది.

"మనింటికి పేపరు వచ్చిందికదా !"

"అవును, వచ్చింది !"

"మరి, మళ్ళీ అదెందుకు రప్పించేవ్?" అడిగేను.

"మీరు దాన్ని ఆఫీసుకు తీసుకు పోతారేమోనని ! - మళ్ళీ వాళ్ళ పేపరు వాళ్ళకు పంపేస్తాను లెండి-" అంటూ దాన్ని కుర్చీలో పడేసింది.

నేను కత్తిరించిన పేపరు భాగంలో ఏముందో తెలుసుకోవాలనే ఉత్సుకతతో, అదే పేపరు పక్కింటినుండి తెప్పించింది సుజాత.

ఈ రాత్రికి ఆమెకు ఏవిధంగా గుణపాఠం చెప్పాలో ఆలోచించుకుంటూ ఆఫీసుకు వెళ్ళేను.

ఆఫీసునుండి వచ్చేసరికి బాగా చీకటి పడిపోయింది.

స్నానంచేసి, భోజనం ముగించి, పుస్తకం చదువుకుంటూ కూర్చున్నాను.

వంటింట్లో పనులు ముగించుకుని సుజాత వచ్చేసరికి పావుతక్కువ తొమ్మిదయింది.

ఈవేళే ఆఖరు రోజు!

త్వరపడి మీ సీటు క్రింది నెంబరుకు ఫోన్‌చేసి రిజర్వు చేసుకోండి!

ప్రకటనకు కుడిప్రక్కన బె తైడు గుడ్డపీలిక ఒంటిమీద కప్పుకుని, నడుం విరుచుకుకుంటున్న భంగిమలో మిస్ లిల్లీ ఫోటో వుంది!

ప్రకటన క్రిందనున్న ఫోను నెంబరు మరి కనబడటంలేదు నాకు!!!